క్లుప్తంగా

పింఛన్ నగదు పంపిణీ



దాచేపల్లి : మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. పింఛన్ నగదును ప్రభుత్వం వలంటీర్లకు అందజేయటంతో తెల్లవారుజాము నుంచే పింఛన్‌దారులకు నగదు పంపిణీ ప్రారంభించారు. ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీవో శోభారాణి పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పిడుగురాళ్ల 17 సచివాలయాల పరిధిలో 33 వార్డుల్లోని లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ అందజేశారు.ప్రతి నెల ఠంఛన్‌గా పింఛన్ నగదును ప్రభుత్వం అందించటం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పింఛన్ల పరిశీలన అధికారి నంటూ రూ. 2వేలు స్వాహా

మాచవరం: పింఛన్ల పరిశీలన అధికారినంటూ వయో వృద్ధురాలి వద్ద రూ.2 వేలు నగదును స్వాహా చేసిన ఘటన మండలంలోని తురకపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. బాధితురాలు షేక్ ఫాతిమూన్‌కు ఆదివారం గ్రామ వలంటీర్ పింఛన్ డబ్బులు అందజేయడం జరిగింది. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి పింఛన్ల పరిశీలన అధికారినని, ఆధార్‌కార్డు, పింఛన్ కార్డు, వలంటీర్ ఇచ్చిన నగదు చూపించాలని వృద్ధురాలిని అడిగాడు. అనంతరం ఆధార్ కార్డు, పింఛన్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురమ్మని వృద్ధురాలి మనవణ్ని బయటకు పంపి పింఛన్ డబ్బులతో ఉడాయించాడు. మోసాన్ని గ్రహించిన వృద్ధురాలు విషయాన్ని చుట్టు ప్రక్కల వాళ్లకు తెలియజేసింది.

పార్టీ మండల అధ్యక్షుడిగా అప్పిరెడ్డి



మాచర్ల రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఈయన పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. తనపై నమ్మకంతో కీలకమైన బాధ్యతలను అప్పగించిన ప్రభుత్వ విప్ పీఆర్కే, జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ప్రతి ఒక్కరు ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పలు మండల కేంద్రాలలో, గ్రామాలలోనూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపట్టారు.

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో పరిసరాలను శుభ్రం చేసే పనులను ఎంపీపీ ,అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, ఈఓపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ నాగులునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో శ్రమదానం చేస్తున్న ఎంపీపీ , జెడ్పీటీసి , వైస్ ఎంపీపీ, తదితరులు

కారెంపూడి: స్వచ్ఛతా హి సేవా పక్షోత్సవాలలో భాగంగా ఆదివారం కారెంపూడి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా ప్రతినిధులు అధికారులు, పంచాయతీ సిబ్బంది శ్రమదానాలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేశారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీటీసీ వేముల లింగయ్య, ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: పరిసరాల పరిశుభ్రత ద్వారానే అంటువ్యాధులను అరికట్టవచ్చునని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా సచివాలయ, రైతు భరోసా కేంద్రాల పరిసరాలలో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద మల్లుస్వామి, వైస్‌ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండలు, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, నాయకులు, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

మాచవరం: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన వీధులను శుభ్రపర్చారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమల నివారణ చర్యలను తెలియజేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దాచేపల్లి : పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, ఎంపీడీవో శోభారాణి, సర్పంచ్‌లు జంగా సురేష్, వినుకొండ కోటేశ్వరరావు, కూనం నాగిరెడ్డి, వెంకటచారి, కొత్తపల్లి కాశయ్య, తండా బుడేసా పాల్గొన్నారు.

గురజాల : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం చేసుకోవచ్చని కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో సచివాలయం పరిసరాల్లో పిచ్చిమొక్కలను, చెత్త కాగితాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సుబ్బారావు, గ్రామ కార్యదర్శి లక్ష్మా నాయక్ తదితరులున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ముక్కంటేశ్వర స్వామి దేవాలయంలో మండల అధ్యక్షుడు యక్కలూరి రామకృష్ణ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. పెనుకొండ అమృతలింగేశ్వరరావు, పిండి రామాంజనేయులు తదితరులున్నారు.



చెరువు కట్టలోని వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు



తంగెడలో పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎంపీపీ కటకం జయశ్రీ, ఎంపీడీవో శోభారాణి

పిడుగురాళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, కౌన్సిలర్ ముక్కంటి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

మండలంలో స్వచ్ఛతా హీ సేవా

దుర్గి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముటుకూరులో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొని పంచాయతీ పరిధిలోని పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా స్వచ్ఛతే సేవ ప్రతిజ్ఞ చేసి పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంది నాసరయ్య, ఎంపీటీసీ పసుపులేటి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, సాక్షరతా సమితి ప్రతినిధి బెంజిమన్, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు తదితరులున్నారు.



ముటుకూరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

పండుగలలో గణేష్ ఉత్సవాలు ప్రత్యేకం

మాచర్ల రూరల్: పండుగలు ఎన్ని వచ్చినా వినాయక చవితి పండుగ విశిష్టమైందని చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగ గణేష్ ఉత్సవాలని వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్ అన్నారు. మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ ప్రజలంతా ఐక్యతగా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకోవటం గ్రామ ఐక్యతకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ పొలిమేరల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బ్యాండు, బాణసంచాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జన కార్యక్రమం

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలోని శ్రీకృష్ణ యాదవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గత 14 రోజులుగా పూజలు నిర్వహించి లడ్డూకు వేలం పాట నిర్వహించగా నక్కనబోయిన ఏడుకొండలు రూ. 62,000లకు దక్కించుకున్నారు.కార్యక్రమంలో 35 కేజీల ఐస్‌తో తయారు చేసిన శివలింగాకారం ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు చింతా వెంకట రామారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

రెంటచింతల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 పోటీలలో విశేష ప్రతిభ కనబరచిన స్థానిక శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులను జిల్లా పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ ఆత్మకూరి నాగేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో జిల్లా పోటీలకు విశేష ప్రతిభ కనబరచిన బాలబాలికలను ఎంపిక చేశారన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీల ద్వారా విద్యార్థులకు తగిన శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని దీంతో వారు ఎంచుకున్న రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. గ్రామాలలోని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యతో పాటు ఆటలలో కూడా ప్రోత్సహించినప్పుడే నైపుణ్యం కలిగిన మెరుగైన క్రీడాకారులు తయారవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధితో పాటు పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీలను నిర్వహించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా పోటీలకు ఎంపికైన రెంటచింతల శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులు

పలు చోట్ల వయో వృద్ధులకు సన్మానం

గురజాల : వయో వృద్ధులను సన్మానించడం మనం ఇచ్చే గౌరవానికి నాంది అని రెవెన్యూ డివిజన్ కార్యాలయ అధికారి కె.అద్దెయ్య అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అక్టోబర్ 1వ తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని మండలంలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో తహసీల్దార్ 100 సంవత్సరాలు కలిగిన వృద్ధురాలిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం పరిపాలనాధికారి శనగల శివనాగిరెడ్డి, టి.సుబ్బారావు తదితరులున్నారు.

మాచవరం: అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల సచివాలయాలలో సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. 80 ఏళ్లు పైబడిన వారిని గుర్తించి సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకీలకమైనదని, వృద్ధులను సన్మానించుకోవడం సంతోషకరమన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 167వ పోలింగ్ బూత్‌లో దుర్గి గ్రామానికి చెందిన 90 ఏళ్ల చెన్నుపాటి సీతారామయ్యను పలువురు సన్మానించారు.



వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

నేడు రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలోని అంతోనివారి కాలనీలో సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి ఆదివారం తెలిపారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కాలనీలోని ప్రతి గడపకు వెళ్లి బుక్‌లెట్‌లను అందచేసి ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆ కుటుంబానికి ఎంత మేర లబ్ధిచేకూరిందో వివరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు చేపట్టే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెంట మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొంటారన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి ఆయా పథకాలను అందించడమే కాకుండా వారు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.